పెళ్ళిళ్ళలో శుభలేఖలు రాసేపుడు ఒక్కరి చేతి మీదుగా అడ్రసులు రాయడం జరగదు కదా - ఒకరు రాయలేదని ఒకరు యిలా ఒకే అడ్రసుకి మూడు నాలుగు కార్డులు వెళ్ళే ప్రమాదం వుంది. లేనివాళ్ళకు అసలు ఒక్క కార్డు కూడా వెళ్ళదెళ్ళదు.

పోస్టలు వాళ్ళు ఉత్తరాల్నీ శుభలేఖల్నీ గ్రీటింగుల్నీ పంచలేక కట్ట కట్టి అవతల పారేస్తూ వుంటారని తత్కారణంబున మనం వేసినా ఎవరికీ అందక ఆభాసుపాలవుతూ వుంటారు పెళ్ళివారని కొందరంటారు. మన దేశంలో అంత నమ్మక ద్రోహం జరుగుతుందా అని ఓ డవుటు - కట్నాలు కానుకలు లాంఛనాలు తీసుగుని పెళ్ళి చేసుకున్నవారి కున్నంత నీతి నిజాయితీ ఉద్యోగుల కుండట్లేదని మనం వాపోతే ఎలా?

అసలు కార్డ్సు అందకపోవడానికి కారణం మనం వేసామనుకుని వెయ్యడం మరిచిపోయి వుండాలి.

మా వారిలాగా - అంటె అమెరికాలో మా వారు శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉత్తరాల డొక్క అనుకుని నీలం డస్ట్ బిన్‌లోకి ఉత్తరాల్ని వేసినట్లు - శుభలేఖలు ఎప్పటికీ ఎన్నటికీ తెరవని పోస్టు డొక్కుల్లో వేసి వుండాలి.

పిలవడాలు సరిగా లేకపోతే పెళ్ళిలో ఫస్ట్ పార్ట్ కుదేలయినట్లే - మనం రాసినా వాటిని తిన్నగా ఓపెన్ చేసే డొక్కుల్లో వేయద్దూ - పిలిపింగ్సంటే మాటలా - తరవాత మిగిలేవి దెప్పుళ్ళే!

# అంతరంగ మథనం

'ఆఫీసుకారు' అనేది ఓ చిన్న స్టేటస్ సింబల్. ఆ కారు తలుపులు తీసిపట్టుకునే చక్రపాణి వుంటే - యింకా బలే మజాగా బావుంటుంది. వాడికి ఓ డవాలీ, మన ముఖ్యమంత్రిగారి తలపాగా కంటె మించిన కుచ్చుల తలపాగా కాలికి చడావులూ వుంటే కడుంగడు దర్జాగా వుంటుంది. పూర్వం రథాలు, గుర్రాలు, ఏనుగులు, పల్లకీలు వున్నట్లే యిప్పుడు ఆఫీసు జీపులు, ఆఫీసు కార్లూ వెలిశాయి. సొంతకారు లేనివారికి ఆఫీసుకారు 'వెండికొండ'. ఆఫీసు కారుకి సొంతకారుకీ తేడా ఏవిటని అడిగారంటే - సత్యభామకి రుక్మిణికి వున్నంత తేడా వుంటుంది. మతాతీత మైన రాజ్యాంగంలాగా ఆఫీసు కారు సెక్యులర్ - సొంత కారున్నవాళ్ళు కూడా ఆఫీసు పనులకు ఆఫీసు కారే వాడ్తారు. ఆఫీసుకారున్న వాళ్ళకు కొందరికి కారు యోగ్యతే నిజ జీవితంలో వుండదు.

పిల్లలకి, ఆడాళ్ళకి కారెక్కడవంటే బలే సరదా! కారు ఎక్కినా ఎక్కకపోయినా 'పప్పాయి...పాం....పాం' అంటూ రబ్బరు బూరానొక్కడం గమ్మత్తుగా వుంటూ నొక్కే చేతులకి

పరమానందంగా కూడా వుంటుంది. అసలు కార్లో కూచోడమే అమ్మ ఒళ్ళో కూచున్నంత మెత్తగా హాయిగా వుంటుంది. బెంచీ మీద కూచున్నపుడల్లా నాకు మునిసిపలాస్పత్రి బెంచీమీద మలేరియాకి ఒణుకుతూ కూచున్నట్లు అనిపిస్తుంది. స్కూల్లో బెంచీ మీద కూచుంటే మేష్టారిబెత్తం ఝళిపిస్తూ వుంటుంది. పిల్లలు అందుకే సోఫా కనిపిస్తే ఎగిరి గంతులేస్తారు. వాళ్ళ చిట్టి చిట్టి లేత పాదాలకు సోఫా మెత్తలు గమ్మత్తుగా వుంటాయి కాబోలు! ఇసుక తిన్నెల మీద తడి తడిగా పొడి పొడిగా వుండే చోట పేదవారి పిల్లలు గంతులేస్తూ ఆనందిస్తూ వుంటారు. మాసిన బట్టల మూట మీదకి ఎగురుతూ వెళ్ళి తొక్కుతూ ఆడుకునే పిల్లలకు కూడా అలాంటి తమాషా ఆనందమే కలుగుతుంది తప్పక. తివాసీ మీద నడుస్తేనూ, పట్టుచీర కప్పుకుంటేనూ, నాన్నారి ముఖమల్ కోటు జేబుల్లో చేతులు పెట్టి వేళ్ళను ముడుస్తూ తెరుస్తూ ఆడుకుంటేనూ అలానే మజాగా వుంటుంది. శ్రీమన్నారాయణమూర్తి ఆది శేషువుపై వయ్యారంగా పడుకున్నప్పుడు కూడా స్వామి వారికి చుట్టలు చుట్టుకున్న ఆదిశేషుడి తల్పం ఫోమ్‌బెడ్ల కన్న మెత్తమెత్తగావుండి తీరాలి. అయినా ఆయన అమ్మవారి చేత 'నీ పాదకమల సేవయు'అన్నట్లు కాళ్ళు వత్తించుకుంటూ ఆనందిస్తూ వుంటాడు. అమ్మవారి చేతులెంత మృదువో, ఎంత దయామృత తరంగిణులో - ఎంత ప్రేమో అదంతా భక్తులకే ఎరుక - మామ్మూలు మనలాటివారికి దూది పరుపులే శేషతల్పాలు. వటపత్ర శాయి వున్నాడనుకోండి తన బొటనవ్రేలు తానే చప్పరిస్తూ పాల సముద్రంలో ఒంటిగా వుయ్యాలలూగు తున్నట్లు వుంటాడ్ట. భీష్మాచార్యులవారు బాణాల మీద పడుకున్నార్ట - మహాత్ములకి కటికనేలైనా ఒకటే హంస తూలికాతల్పమైనా ఒకటే - పండితాః సమదర్శనాః అన్నారు. చూడండి ఆఫీసుకారు మీంచి ఆలోచనలు ఎలా తీవలుసాగి పూలు పూశాయో?

'ఆఫీసు కార్లనేవి మిస్యూజ్ చేయబడ్డానికే వుద్దేశింప బడ్డాయి,' అని మావారు అంటారు. తెలివి తక్కువ మాటల్లో కూడా గ్రహించవలసిన నిజం అప్పుడప్పుడు తళుకు తళుకు మంటూ సిగరెట్టు పెట్టెల్లో ముచ్చె కాగితంలా మెరుస్తూ వుంటుంది. ఏ సినిమాకేనా వెళ్ళండి. హాలు బయట గవర్మెంటు జీపులూ, గవర్మెంటు కార్లూ బారులు తీర్చి వుంటాయి. ఆ డ్రయివర్లంతా ఆఫీసర్ల పెళ్ళాల దవుష్ట్యం గురించి కబుర్లు చెప్పు కుంటూ, బీడీలు కాలుస్తూ, టీలు తాగుతూ గప్పాలు కొడుతూ వుంటారు. షాపింగ్‌కి వెళ్ళినపుడు ఆఫీసు కార్లో వెళ్తే కొట్టువాడు కూల్ డ్రింకులు తెప్పించి యిస్తాడు. కొట్టులో కుర్రాళ్ళు ఫలానా వారి ఆడంగులు అంటూ అందం చందం వున్నా లేకపోయినా ఆశ్చర్యంగా చూస్తారు. ఆడవాళ్ళు తింటూ కూచోడం వలన, కూచుని తిండంవలనా లావెక్కి పాలకొల్లు బత్తాయిలా నవనవలాడుతూ వుండవలసిన వనితలు పంపర పనస కాయల్లా తేల్తారు. 'అందమును హత్య చేసెడి హంతకుండ' అన్నట్లు చాలామంది అందాన్ని హత్య చేసేట్లు చీరలు, నగలు ధరిస్తారు. ఎలాటి చీరనెలా కట్టుకున్నా 'వాకింగ్'

చేతవాలిగా – హైక్లాసు మహిళలు నడుస్తూంటే, రోళ్ళు, మద్దెలలు, డ్రమ్ములు, న్యూస్ ప్రింటు రీల్సు దొర్లుకుంటూ వెళ్తున్నట్టు (హంస నడకలు, గజ గమనాలు, మయూరి నర్తనాలు ఎట్సెట్రాలను బ్లాక్ బోర్డ్ మీంచి డస్టర్‌తో తుడిచేసినట్లు తుడిచేస్తూ) ఇల్యూజన్స్‌ను బరబరా గుర్తుకు తెస్తారు. వీళ్ళ పెళ్ళి ఫోటోలు, కాలేజీ గ్రూప్ ఫోటోలు, హాస్టళ్ళలో ఫ్రెండ్స్ తాముంచుకున్న ఫోటోలను చూస్తే ఆ చిలక లేనా యీ రుబ్బు రోళ్ళు, ఆ హంస లేనా యీ పీపాలు, డ్రమ్ములూ అనివాపోవలసి వస్తుంది. కారుల్లో అందమైన వాళ్ళే కూచుంటారు అనే ఆర్యోక్తికి సవరణపై వ్యాఖ్యలు.

ఆఫీసు కారులో వుల్లిపాయలు, కరివేపాకు కొనుక్కోడానికి వెళ్ళినా తప్పలేదు. అర్జునుడి జీప్‌ను శ్రీకృష్ణుడు వాడబట్టే పార్థసారథి అయ్యాడు. ఆ కాలంలో వాళ్ళ పెళ్ళాలు షాపింగ్‌కి, గట్రా వెళ్ళినపుడు ఈ రథాల్ని మిస్యూజ్ చేసే వుంటారు. పూర్వం వీళ్ళంతా 'కింగ్సూ క్వీన్సూ' జలక్రీడలకు విలాసార్థం బయల్దేరి నపుడు రథాలమీదే వెళ్ళి వుంటారు. డ్రయివింగ్ లైసెన్సులూ అవీ పూర్వం వుండకపోయినా డ్రయివింగ్ సెన్స్ రాణులకి కూడా రాజులతో బాటు వుండేది. దశరథుడు –కైక వృత్తాంతం చూడుడు. చక్రం దొర్లి పోతుంటే అందులో తన వేలు పెట్టి రథం దొర్లిపోకుండా ఆపుచేసిందట మన కైకమ్మవారు. ఆవిడ వేలు ఎంత గట్టిదో తల్చుకుంటే భయం వేసి జ్వరం, వొణుకూ వస్తుంది. ఇప్పుడు రైళ్ళూ, బస్సులూ, టాక్సీలు వచ్చాయి గనక మామూలు జనానికి వాహన యోగం పట్టింది గాని పూర్వం చాలామంది కాశీకి కూడా కాలినడకనే వెళ్ళివచ్చి మజిలీకో కథ చొప్పున కాశీ మజిలీ కథలు చెప్పుకునేవారు. కార్లకి పద్మిని, రోల్స్‌రాయిస్, వాక్సహాల్, ఫియట్, ఫోర్డ్, మారిస్ మైనర్, మారుతి అని యిన్ని పేర్లున్నట్లు అర్జునుడి, రథానికి కట్టిన గుర్రాలకి శైబ్య, సుగ్రీవ, మేఘ పుష్ప బలాహకం అని వుండేవిట.

రోడ్డుమీద వెళ్ళేప్పుడు జాగ్రత్తగా గమనిస్తే లారీలకు చాలా ముద్దు ముద్దు పేర్లు పెట్టుకుంటారు వాటి ఓనర్లు. రాక్షసుడు, వైజయంతి, పోకిరీపిల్ల, రోడ్డురాణి, చిరంజీవి, కృష్ణ, రవుడీ రంగడు అని యిలా గమ్మత్తు పేర్లు రాసుగుంటారు. లారీల పేర్లమీద ఎవరయినా రీసెర్చి లాగించవచ్చు లేదా యం.ఫిల్. చేయవచ్చు.

అసలు కంటే కొసరు ముద్దయినట్లు ఆఫీసు కారుని మిస్యూజ్ చేస్తే కలిగే ఆనందం అంతా యింతా కాదు. ఆఫీసుకార్లో ఆఫీసుపనిమీద అన్చెప్పి సొంత పనిమీద మరో రూటులో మరోచోటుకి వెళ్ళినపుడు దారిలో యాక్సిడెంట్ అయితే బలే స్టోరీ పుడుతుంది. ఆ కథ మరోసారి చెప్పుకుందాం. ఆఫీసు కారుకే ఆత్మవుంటే దాని ఆత్మకథ బెస్ట్ స్మెల్లర్ అవుతుంది. దట్సాల్!